క్లుప్తంగా

ధరణితో దోచుకున్నారు

ఇబ్రహీంపట్నం రూరల్: ధరణితో బీఆర్ఎస్ నాయకులు సర్వం దోచుకున్నారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామంలో తహసీల్దార్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు.. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగన్‌పల్లిలో 297 సర్వే నంబరు సమస్యలపై సమగ్ర విచారణ జరిపించి, సమస్య లేకుండా చేస్తామని హామీనిచ్చారు. అనంతరం ఇందిరమ్మ పథకం లబ్ధిదారు లక్ష్మమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేషస్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య సహాయకులు కొత్త మల్లేశ్, శ్రావణిలు 174 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, అద్దాలు అందజేశారు. నేత్ర చికిత్స అవసరమున్న వారిని 95 మందిని పుష్పగిరి ఆస్పత్రికి పంపించారు. ఆస్పత్రి సిబ్బంది గీత, షబానా తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: మొక్కలు నాటి పర్యవరణ పరిరక్షణకు పాటుపడాలని ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళ్‌పల్లి సమీపంలోని ఓ పార్కులో 1000 మొక్కలు నాటి, వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని, రోజు వారి కార్యక్రమాలతో ప్రజలను చైతన్యం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ స్వర్ణకుమార్, మున్సిపాలిటీ మేనేజర్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్య శిబిరం వద్ద ప్రజలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గురువారం ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యాధికారి డాక్టర్ మంజులదేవి, డాక్టర్లు రచనాసింగ్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో 198 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 10 మందికి ఎక్సరే, 72 మందికి బీపీ, మధుమేహ పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది వేణు, నాగేశ్వరి, విజయ్ కుమార్, అలీం, భారతమ్మ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆయన రూ.1 లక్ష 16 వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డిని సన్మానించారు.

నేటి నుంచి దేవాలయ వార్షికోత్సవాలు

శంకర్‌పల్లి: అయ్యప్పస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. శుక్రవారం గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహనం, క్షేత్రపాలక దేవతారాధన, శనివారం అవాహిత దేవతారాధన, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, శత కలశ స్థాపనం, ఆదివారం పూర్ణాహుతి, క్షేత్రపాలక బలి, శత కలశాభిషేకం, చక్రతీర్థం, కలశ ఉద్వాసనం కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. నిత్యం అన్నప్రదానం చేస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

హైలెవల్ బ్రిడ్జి.. లోలెవల్ వర్క్

- తొమ్మిదేళ్లకే దెబ్బతిన్న పోచారం వంతెన
- నాసిరకం పనులతో తేలిన ఇనుప చువ్వలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మొదటికే వచ్చిందంటున్న స్థానికులు





పోచారం హైలెవల్ బ్రిడ్జి (ఇన్‌సెట్లో) ఇనుప చువ్వలు తేలిన వంతెన

ఇబ్రహీంపట్నం రూరల్: వంతెన నిర్మాణంతో సుదీర్ఘకాలం కల నెరవేరిందని ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. ఇక మీదట భారీ వర్షాలు పడినా తమ ప్రయాణం సాఫీగా సాగుతుందని భావించారు. కానీ వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. నాసిరకం పనులతో బ్రిడ్జి పటిష్టత దెబ్బతిని, ఇరు గ్రామాల ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఇదీ ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి భారీగా నీరుపారే ఫీడర్ చానల్‌పై నిర్మించిన వంతెన దుస్థితి.

మూడు చోట్ల..

ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామ శివారులోని పెద్దవాగు.. వర్షాకాలంలో భారీ వరదతో పరుగులు తీస్తుంది. మీర్‌ఖాన్‌పేట నుంచి ఎల్మినేడు మీదుగా ప్రవహిస్తుంటుంది. దీనిపై పై వంతెన నిర్మాణం చేస్తే చర్లపటేల్‌గూడ, ఎల్మినేడు, తుర్కగూడ, తులేకలాన్, ఎర్రకుంట గ్రామాల ప్రజలకు పోచారం మీదుగా వెళ్లి, నాగార్జున సాగర్ రహదారికి సులభంగా చేరుకోవచ్చు. దీనిని గుర్తించిన ప్రభుత్వం.. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డు ద్వారా పోచారం, కర్ణంగూడ మధ్యలో హైలెవల్ బ్రిడ్జి (పొడవు 93.08 మీటర్లు)ని రూ.2.88 కోట్లతో 2016 ఆగస్టు 24న ప్రారంభించారు. 2017లో నిర్మాణం పూర్తి చేశారు. పదేళ్లు గడవక ముందే.. నాసిరకం పనుల కారణంగా ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. మూడు చోట్ల ఇనుప చువ్వలు తేలాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

నరక ప్రయాణం

రహదారి సాఫీగా ఉండటంతో సహజంగానే వాహనచోదకులు తమ వాహనాలను పరుగులు తీయిస్తుంటారు. ఈ క్రమంలో వంతెనకు చేరువ కాగానే.. కుదుపుల సంగతి ఎలా ఉన్నా.. తేలిన ఇనుప చువ్వలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వంతెనపై ప్రయాణిస్తున్న సేపూ కుదుపులతో పాటు భారీ శబ్దం రావడంతో భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేసినప్పటి నుంచి నేటి వరకు సంబంధిత అధికారులు పర్యవేక్షించలేదని, క్వాలిటీ కంట్రోల్ శాఖ పర్యవేక్షించకుండా, కాంట్రాక్టర్లతో అధికారులు చేతులు కలపడంతోనే వంతెన పనుల్లో నాణ్యత లోపించిందని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతులు చేయించాలని, పనులు దక్కించుకున్న నిర్మాణదారుడితో పాటు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూ భారతితో రైతులకు మేలు



మంచాల: తాళ్లపల్లిగూడ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కడ్తాల్: డీటీ ఆదిత్యరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- భూ సమస్యలకు సత్వర పరిష్కారం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అధికారులు

మంచాల: దశాబ్ద కాలం పాటు ధరణి పేరుతో గత పాలకులు దగా చేశారని, భూములు లాక్కున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. భూభారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని, జటిల సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గురువారం మంచాల మండలం తాళ్లపల్లిగూడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. తాళ్లపల్లిగూడ గ్రామంలో 84 సర్వే నంబర్‌లో 484 ఎకరాల్లో కబ్జాలో ఉన్న వారికి చట్ట ప్రకారం న్యాయం చేస్తామని తెలిపారు. ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ వెంకట ప్రసాద్ రావు, రమేష్, ఎంపీడీఓ బాల శంకర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ షేక్ ముంతాజ్ అన్నారు. చల్లంపల్లి, రావిచేడ్ గ్రామాల్లో తహసీల్దార్ ముంతాజ్, డీటీ ఆదిత్యరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చల్లంపల్లిలో 41, రావిచేడ్‌లో 34 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించామని అధికారులు తెలిపారు. కాగా.. భూ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి డీటీకి వినతిపత్రం అందజేశారు.

వినియోగించుకోండి



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లలిత

ఆమనగల్లు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆమనగల్లు తహసీల్దార్ లలిత అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్.. మాట్లాడుతూ.. రైతుల మేలు కోసమే ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందని, దీంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముగ్గురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ సంపత్‌కుమార్, ఏఆర్ఐ అబ్దుల్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో పీహెచ్‌సీ





నందివనపర్తి ఆరోగ్య ఉప కేంద్రం (ఇన్‌సెట్లో) పీహెచ్‌సీ ఏర్పాటుకు ఉప కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

- సౌకర్యాల ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయింపు
- భవనాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ

యాచారం: నందివనపర్తిలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు కానుంది. దీంతో ఆ గ్రామంతో పాటు అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, పిల్లిపల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. అంతే కాకుండా మండల కేంద్రం యాచారం వెళ్లాల్సిన అవసరం ఉండదు. గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు లేఖ రాసారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

రూ.20 లక్షల నిధులతో...

ప్రస్తుతం నందివనపర్తిలో కొనసాగుతున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయనున్నారు. అందుకు అనుగుణంగా రూ.20 లక్షలతో ఆ భవనాన్ని మరమ్మతు చేయనున్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించనున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. పీహెచ్‌సీకి కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు.

యాచారం నుంచి తరలింపు

మండల కేంద్రంలోని ఒకే భవనంలో ప్రస్తుతం వైద్య విధాన పరిషత్ (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కొనసాగుతున్నాయి. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకే చోట కొనసాగడంతో ఏ శాఖ సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారో తెలియడం లేదు. అంతే కాకుండా ఒకే చోట కాకుండా.. ఇక్కడి నుంచి మరో గ్రామానికి పీహెచ్‌సీని తరలిస్తే.. ఆ పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ అవుతాయని భావించారు. ఈ నేపథ్యంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన నందివనపర్తిలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని నిర్ణయించారు. పీహెచ్‌సీ ఏర్పాటు అనంతరం.. యాచారం పీహెచ్‌సీ సిబ్బందినే అక్కడికే తరలించి, ప్రజలకు వైద్య సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయనున్నామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. మరో కొద్ది రోజుల్లో నందివనపర్తిలో పీహెచ్‌సీ సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల పరిధి వీరసముద్రంలో గురువారం వేద మంత్రోచ్చారణల మధ్య సీతారామస్వామి, శివగింగం, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాభిశిల విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు.

పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

- కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని చెప్పారు. అర్హులెవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా అందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కెఎస్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు శివలింగం, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అప్పం శ్రీను, ప్రసాద్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వారు ప్రారంభించారు. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, విడతల వారీగా ప్రభుత్వం అందరికీ లబ్ధి చేకూర్చనుందని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసురవి, నాయకులు జహంగీర్‌అలీ, సత్యంయాదవ్, రాంచందర్ నాయక్, మల్లేశ్‌గౌడ్, భానుకిరణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీను, శ్రీకాంత్, లక్ష్మయ్య, రాములు, నర్సింహ, మల్లయ్య, సురేశ్ ఉన్నారు.

త్వరగా నిర్మించుకోవాలి



కడ్తాల్: నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు.. ఇంటిని త్వరగా నిర్మించుకోవాలని కడ్తాల్ ఎంపీడీఓ సుజాత అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. వర్షకాలం నేపథ్యంలో మంజూరు పత్రాలు అందుకున్న వారు త్వరగా పనులు మొదలు పెడితే, సకాలంలో పూర్తి చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రోత్సహించాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే న్యాయం



తలకొండపల్లి.. పడకల్‌లో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం అన్నారు. గురువారం ఆయన తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామ కార్యదర్శి ఆశిశ్‌రెడ్డి, నాయకులు భిక్షపతి, శంకర్, రవి, కృష్ణయ్య, శ్రీను, రామస్వామి, వెంకటయ్య, మల్లేశ్, రవి, పాండు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి
- అడవులను సంరక్షించుకోవాలి
- అధికారులు, నాయకులు
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



కడ్తాల్: మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు



ఆమనగల్లు: కోనాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కుసుమమాదురి తదితరులు



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో.. ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్ తదితరులు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/ కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. అడవులను సంరక్షించుకోవాలని, ప్లాస్టిక్ వాడాకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఎపీఓ లలిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు హీరాసింగ్, తులసీరాం, సాయికుమార్, కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో గురువారం ఎంపీడీఓ కుసుమమాదురి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీఓ వినోద, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

తుర్కయంజాల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ డీఈఈ భిక్షపతి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 4వ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్నెగూడలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ రేవల్లి హరిత, ఆర్ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పంచాయతీ ఆఫీసర్ రఘు, గ్రామ కార్యదర్శి రాజ్‌కుమార్‌లతో కలిసి ముకునూర్‌లో గురువారం మొక్కలు నాటారు.



తుర్కయంజాల్: మన్నెగూడ ర్యాలీలో అధికారులు తదితరులు



యాచారం: నస్దిక్‌సింగారంలో.. ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ తదితరులు



పెద్దఅంబర్‌పేట: ఈదులచెరువు కట్టపై.. కమిషనర్ రవీందర్‌రెడ్డి

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

షాద్‌నగర్: మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 27వ వార్డు న్యూసిటీ కాలనీలో ఉన్న పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా వందరోజుల ప్రణాళిక ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.